## క్లుప్తంగా

### నేడు గ్రంథాలయం ప్రారంభం

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ బీసీ భవన్‌లో ఈ నెల 1వ తేదీన మహాత్మా జ్యోతి రావు పూలే గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవ పూజ ధనుంజయ ఆచారి, బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి,కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీసీ కుల సంఘాల నా యకులు,విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

### బలిజ మహిళలకు రిజర్వేషన్లు పునరుద్ధరించండి

కర్నూలు(అర్బన్): బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఐదు శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని బలిజ మహిళా సంఘం నేతలు కోరారు. మంగళవారం స్థానిక టీజీవీ కళాక్షేత్రం సాహితీ వేదికలో సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సంఘం కన్వీనర్లు డా.జ్యోతిర్మయి, భారతీ, సుజాత మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన 10 శాతం కోటాలో 5 శాతాన్ని తమ వర్గానికి కేటాయించాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బలిజ మహిళా కల్చరల్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సంగీతం, నృత్యం, వక్తృత్వం తదితర అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నిధుల కొరతతో ఆగిపోయిన కాపు భవన్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు. సమావేశంలో ఉమాదేవి, బ్రాహ్మణీ, అనురాధ, మల్లిక, సరస్వతి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని టీడీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయబాబుతో కలసి మంగళవారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.బజారన్న, ప్రధాన కార్యదర్శి బి.సుభాన్ సింగ్, ఉపాధ్యక్షుడు అంజి బాబు, కార్యదర్శి వై.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు ఉస్మానియా విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సమీయుద్దీన్

కర్నూలు (టౌన్): వచ్చే నెల ఫిబ్రవరి 4 నుంచి 8వ తేదీ వరకు సేలమ్ పట్టణంలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉస్మానియా కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు కె.గోపి, ఉదయ్, హర్షవర్ధన్, సంపత్‌కుమార్, శేఖర్‌లను ప్రిన్సిపాల్ సమీయుద్దీన్ మంగళవారం అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయమా ఉపాధ్యాయులు రఫీక్ అహమ్మద్, పట్టాబి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సీఎం కప్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు (టౌన్): జనవరి 25 నుంచి 28 వరకు జరిగిన ఏపీ సీఎం కప్ టోర్నమెంటులో పలు క్రీడాంశాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. పరుగు పందెంలో చంద్రప్ప గారి దేవి బంగారు పతకం, ఫుట్‌బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థినుల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థినులను మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళావతి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### దళితుల అభివృద్ధే లక్ష్యం

కర్నూలు (అర్బన్): దళితుల అభివృద్ధే దళిత శక్తి ఫౌండేషన్ ముఖ్య లక్ష్యమని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామ, మండల, పట్టణ, జిల్లాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను కలుపుకుంటూ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం భవితా కేంద్రం ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ అనంతయ్య సూచించారు. మంగళవారం కోడుమూరు కొండపేట ప్రాథమిక పాఠశాలలోని భవితా కేంద్రాన్ని ఎంఈఓ తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఫిజియోథెరపిస్టు అమూల్య చేస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం భవితా కేంద్రంలో ఉచితంగా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలన్నారు.

# జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్, పాణ్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాదిరాజు నగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి.



పాణ్యంలోని బీసీ కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు/పాణ్యం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలోని మాదిరాజు నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రం పాణ్యంలోని సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే... మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజాప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామని చెప్పారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కల్లూరు 35వ వార్డులో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు (స్టాండింగ్ కమిటీ సభ్యులు) సాన శ్రీనివాసులు, ఇప్పల నారాయణరెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ చిన్నారులతో ఎమ్మెల్యే ముచ్చట :** గడప గడప కార్యక్రమంలో భాగంగా పాణ్యంలో అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లిన ఎమ్మెల్యే కాటసాని పిల్లలతో ముచ్చటించారు. వారికి ఏ ఆహారం అందిస్తున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివస్వాముల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం చెంచుకాలనీలో నిర్వహించిన శివస్వాముల భిక్ష కార్యక్రమానికి హాజరై వారితో కలిసి భిక్ష చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, పుల్లయ్య, సుబ్బరాయుడు, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, ఆటో మాబు, మహేష్, నాగరాజు, నూర్‌బాషా, కృష్ణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులకు ప్రభుత్వం అండ

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): అన్ని వర్గాల చిరు వ్యాపారస్తు లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని కర్నూలు ఎమ్మె ల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని 7వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడ్డ వీధి సందుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. వారి స మస్యలు, ఇబ్బందులు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న వ్యాపారస్తులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఏటా నగదును ఖాతాలో జమ చేస్తోందని చెప్పారు. పేదల కష్టాలను స్వయంగా చూసి తెలుసుకున్న సీఎం జగన్ వాటి పరిష్కారానికే సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పథకాల నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.1.75లక్షల కోట్లు ఖర్చు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మౌలానా మంజూర్, నాయకులు నవీద్, పర్వేజ్, షోయబ్, అన్వర్, నజీర్, శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల సందడి,(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

కర్నూలు (న్యూటౌన్): కోరిన కోర్కెలను తీర్చే వెంకాయపల్లె ఎల్లమ్మతల్లికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన బి.ఈశ్వరయ్య, మస్తానమ్మ దంపతులు 2 తులాల బంగారు నెక్లెస్‌ను అమ్మవారికి అందించారు. అదేవిధంగా ఎవరెస్ట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యజమాని మద్దిలేటి స్వామి 15 గ్రాముల బంగారు నల్లపూసల దండ, వెంకాయపల్లెకు చెందిన పాలపల్లి మల్లికార్జున, నాగమ్మలు కలిసి అరకేజీ వెండి నాగ పడిగె అమ్మవారికి బహూకరించారు. ఎల్లమ్మతల్లి ఆలయానికి జిల్లాతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటలకు ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాల అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పట్టువస్త్రాలు, పూలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు, ఉద్యోగం పొందిన వారు, ఇంకా ఇతర మొక్కులు తీరిన వారు ఎల్లమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సాహిత్య పురస్కారాలకు ఎంట్రీల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారాలు-2022 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, అయ్యన్న పేర్కొన్నారు. మంగళవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2022 జనవరి నుంచి 2022 డిసెంబర్ వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రచురితమైన కవిత సంపుటాలను ఎంట్రీలుగా ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ కవితాలను ఏప్రిల్ 27వ తేదీన ప్రకటించనున్నట్లు వారు వివరించారు.

### పునరుత్పాదక విద్యుత్‌దే భవిష్యత్



సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): భవిష్యత్ పునరుత్పాదక విద్యుత్‌దేనని మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ ప్రతినిధులు అరవింద్(సైంటిస్ట్), రాదేశ్యామ్ పేర్కొన్నారు. మంగళవారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు మెగా అల్ట్రా సోలార్ పార్కును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. సోలార్ పవర్, గాలిమరలు ద్వారా కర్నూలులో అత్యధికంగా విద్యుత్ ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ విషయాలను ఫీల్డ్ విజిట్‌ల ద్వారా చూసి ప్రత్యక్ష అనుభూతిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సురేఖారెడ్డి, ఇంజినీర్లు సత్యానారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

### వైభవంగా మిన్నెల్లస్వామి కిస్తీ వేడుకలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పొన్నకల్‌లో కొలువైన అయ్యకొండ మిన్నెల్లస్వామి కిస్తీ(జియారత్) వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు జరిగిన కిస్తీ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను కిస్తీ బండ్లలో తీసుకువచ్చారు. మిన్నెల్లస్వామికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను అందించి దర్గా ముందు ఉన్న గుండంలో కిస్తీ ప్రసాదాన్ని వేయగా తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. అనంతరం దర్గాలో భక్తులు ప్రార్థనలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం లేకుండా ఎస్‌ఐ నరేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును నిర్వహించారు. కిస్తీ వేడుకలకు వచ్చిన భక్తులకు దాహం తీర్చేందుకు మాజీ జెడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

## ఎర్రదొడ్డిలో ఘనంగా దేవర

కోడుమూరు రూరల్: మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో మంగళవారం శ్రీసుంకులమ్మ దేవర ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. సుమారు 70 సంవత్సరాల తర్వాత దేవరను నిర్వహించడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి పూర్ణకుంభంతో వెళ్లి సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. దేవర ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కోడుమూరు ఎస్‌ఐ విష్ణునారాయణ తన సిబ్బందితో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

### ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గడివేములతో పాటు కొర్రపాలూరు, గని గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా సచివాలయాల్లో లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లులను ఎప్పటికప్పుడు అందిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ విజయసింహారెడ్డి, హౌసింగ్ ఏఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకే అంకితం

- ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- పుట్టిన రోజు సందర్భంగా నగరంలో సేవా కార్యక్రమాలు



చీరలు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సేవకే తాను అంకితం అవుతానని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు శుభకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్‌లు, ఆసుపత్రిలో పండ్లు, బెడ్లు పంపిణీ, మెడికల్, ఐ క్యాంప్‌లు, చీరల పంపిణీ, వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తానని చెప్పారు. కర్నూలు నగరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన ముందున్న లక్ష్యమని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి సహకారం ఉందని తెలిపారు. నగర ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని, సమ్యలు ఎదురైనప్పుడు ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా తనను కలవొచ్చని అన్నారు. ముఖ్యంగా కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమాల్లో పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, హెచ్‌కే టీం సభ్యులు పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): తన జన్మదినాన్ని పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో బాలింతలకు మంగళవారం ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పండ్లు పంపిణీ చేశారు. ఆయనకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆసుపత్రి అధికారులకు సూచించారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీబీఎస్‌సీ పాఠశాలల అథ్లెటిక్స్ పోటీలకు సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన శ్రీనిధి, ఇమ్మరాజులను పాఠశాల ప్రిన్సిపాల్ ఐశ్వర్య రెడ్డి మంగళవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. రంగారెడ్డి జిల్లాలో గత నవంబర్ 30 వతేదీన నిర్వహించిన సీబీఎస్‌సీ క్లస్టర్ -7 పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు.

## యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని మునగాల పాడు నుంచి అశోక్‌నగర్ వాటర్ వర్క్స్ వరకు ఉన్న ప్రధాన పైపులైన్‌కు మంగళవారం తెల్లవారు జామున నుంచి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఫిబ్రవరి 1, 2 తేదీలలో నగర వాసులకు నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇప్పటికే నగర ప్రజలకు సమాచారం ఇచ్చారు. 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో కార్మికులతో ప్రధాన పైపులైన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని సకాలంలో అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న హరీష్‌కుమార్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు యువతీ, యువకులు ముందుకురావాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నేతాజీ జయంతి వారోత్సవాలు ముగిశాయి. చరిత్ర అధ్యాపకుడు వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సుభాష్‌చంద్రబోస్ గొప్ప మానవతావాది అని, ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళాశాతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్కిల్‌హబ్‌ల మరమ్మతులను త్వరగా పూర్తి చేయండి

- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్అండ్‌బీ సీఈ మాధవీ సుకన్య



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఫేజ్-2 కింద చేపట్టిన స్కిల్‌హబ్‌ల మరమ్మతులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీరు (బిల్డింగ్స్) మాధవీ సుకన్య ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆమె వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కే నాగరాజు, కర్నూలు ఈఈ ఏవీ శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.40 లక్షలతో కర్నూలు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని స్కిల్‌హబ్‌లకు చేపట్టిన మరమ్మతులను ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే జిల్లాలోని వెల్దుర్తి మండలం రామళ్లకోట, గోవర్ధనగిరి, గూడూరు మండలం కే నాగలాపురం, గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు, ఆస్పరి మండలం ములుగుందం, కోసిగి మండలం కందుకూరు, దేవనకొండ మండలం తెర్నేకల్, మంత్రాలయం మండలం కాచాపురం, పెద్దకడుబూరు మండలం హెచ్ మురవని గ్రామాల్లో రూ.18.57 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయన్నారు. ఈ భవన నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించేందుకు రెండు, మూడు రోజుల్లో పాలనా అనుమతులు మంజూరు కానున్నట్లు చెప్పారు. పాలనా అనుమతులు మంజూరైన వెంటనే టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.

### డ్రైనేజీలు నిర్మించాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని పాతబస్తీలో డ్రైనేజీలు పాడవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సీపీఎం నాయకులు పాతబస్తీలోని పలు కాలనీల్లో పర్యటించి పాడైన డ్రైనేజీల వివరాలు సేకరించారు. ముఖ్యంగా సెంట్రల్ లైబ్రేరీ వెనుక ప్రాంతంలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందన్నారు. మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం ఈ దయనీయ స్థితికి అద్దం పడుతోందని ఆరోపించారు. తక్షణమే డ్రైనేజీలతోపాటు సీసీరోడ్లను నిర్మించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

### ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో వేధింపులు

- హాస్టల్ ఖాళీ చేసిన విద్యార్థినులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) శిక్షణ పొందుతున్న విద్యార్థినులు మంగళవారం ఉన్నఫలంగా హాస్టల్ ఖాళీ చేసి వెళ్లిపోయారు. శిక్షణ ఇస్తున్న ప్రిన్సిపాల్ తమను నిత్యం వేధిస్తున్నారని పేర్కొంటూ ఉదయం ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ఆమెకు సంఘీభావంగా మిగిలిన విద్యార్థినులు ప్రిన్సిపాల్ వేధింపులు భరించలేకపోతున్నామని, తాము ఇక్కడ ఉండలేమంటూ హాస్టల్ వదిలారు. ఈ విషయమై శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్యకు వారు వినతి పత్రం సమర్పించినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ విజయసుశీలను వివరణ కోరగా ఎవ్వరినీ వేధింపులకు గురిచేయలేదని, పరీక్షల నిమిత్తం వారం రోజుల పాటు విద్యార్థినులకు సెలవులు ఇచ్చినట్లు తెలిపారు.

## నర్సింగ్ సూపరింటెండెంట్‌కు సన్మానం



ఆశా సజనిని సన్మానిస్తున్న హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఆశ సజనిని మంగళవారం అధికారులు, నర్సులు ఘనంగా సన్మానించారు. ఆమె బదిలీపై గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్తున్న సందర్భంగా ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఫేర్‌వెల్‌పార్టీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలో మూడున్నరేళ్ల పాటు ఆశ సజని నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డాక్టర్ హేమనళిని, నోడల్ అధికారి డాక్టర్ శివబాలనాగాంజన్, ఏడీ రమేష్‌బాబు, హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

**నూతన నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వెంకట తులశమ్మ**

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా వెంకట తులశమ్మ నియమితులయ్యారు. గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న ఆమె బదిలీపై కర్నూలు రానున్నారు.





కర్నూలు జోన్ రాయలసీమ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన ఆర్‌యూ జట్టు

## క్రికెట్ విజేత ఆర్‌యూ జట్టు

కర్నూలు (టౌన్): గత ఐదు రోజులుగా రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతున్న కర్నూలు జోన్ అంతర్ డిగ్రీ కళాశాలల క్రికెట్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల జట్టు 16 ఓవర్లలో 101 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ దిగిన ఆర్‌యూ జట్టు 13 ఓవర్లు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 102 స్కోర్ చేసి విజేతగా నిలిచింది. స్థానిక యూనివర్సిటీలో విజేతలకు ఆర్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సివి.కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి.శివకిషోర్ పాల్గొన్నారు.